గరికపాటికి బసవేశ్వరుడి ప్రతిమను అందజేస్తున్న జగద్గురు చంద్రశేఖర శివాచార్య

పంచాక్షరి మంత్రం సర్వశ్రేయస్కరం

సదాశివపేట, జూలై 17: ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రం సర్వ శ్రేయస్కరమని సహస్ర అవధాని, పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు భక్తులకు సూచించారు. స్థానిక బసవ సేవా సదన్‌లో నిర్వహిస్తున్న శివ పంచాక్షరి కోటి జప యజ్ఞం, సామూహిక ఇష్ట లింగార్చన మహోత్సవంలో భాగంగా నాలుగో రోజు బుధవారం జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో సామూహిక ఇష్ట లింగార్చన, పాద పూజ నిర్వహించారు. సాయంత్రం మహా సహస్ర అవధాని గరికపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహాత్మా బసవేశ్వరుడు మానతావాది అని, అందరినీ భక్తి మార్గంలో నడిపిన మహనీయుడని కొనియాడారు. గరికపాటి నరసింహారావుకు కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య బసవేశ్వరుడి ప్రతిమను అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం, చౌకి మఠం అధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లోడి వీరేశం, తదితరులున్నారు.

రోటరీ క్లబ్ సేవలు అద్భుతం

కంది, జూలై 17: సంగారెడ్డి మంజీరా రోటరీ క్లబ్ సేవలు అద్భుతమని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత బుక్స్ పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. సంగారెడ్డి మంజీరా రోటరీ క్లబ్ 23వ సంస్థాపన వేడుకలను మంగళవారం రాత్రి సంగారెడ్డిలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రోటరీ క్లబ్ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల మౌలిక సదుపాయాల కల్పనకు తమవంతు తోడ్పాటును అందించాలన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రమణాదేవరకొండ మాట్లాడుతూ ఆర్థికంగా వెనకబడిన వర్గాలు, మహిళా సంఘాలకు చేయూతనందించడంలో క్లబ్ ముందుందన్నారు. డయాలసిస్ సెంటర్లు, హెల్త్ క్యాంపులు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, ఉచిత నీటి సరఫరా తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని కొనియాడారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న రోటరీ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపన్న గారి చంద్రశేఖర్, నక్క రమేశ్‌తో పాటు డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయించారు. రోటీరియన్ దినేశ్, క్లబ్ సభ్యులు పూ సల లింగాగౌడ్, అడ్వకేట్ అంజయ్య, సిద్ద న్న, నాగిరెడ్డి, కిషన్, పాండురంగం, భూ మయ్య, డాక్టర్ రాజు, సంపత్, సత్యనారాయణ, ప్రభాకర్, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

రసాయన వ్యర్థాల పారబోతపై ఆందోళన

జిన్నారం, జూలై 17: ఖాజీపల్లి పారిశ్రామిక వాడ సమీపంలోని అలీసాబ్ కుంట వద్ద రసాయన వ్యర్థాల పారబోతపై గ్రామస్తులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన వ్యర్థాలు పారబోసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లకు పంపించాల్సిన ఎఫ్లుయెంట్‌లను ట్యాంకర్ల ద్వారా పారబోయడంపై ఆవేదన చెందారు. వెంటనే పీసీబీ అధికారులకు ఫోన్ చేసి చెప్పడంతో అధికారులు వచ్చి శాంపిల్స్ సేకరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఖాజీపల్లి గ్రామాన్ని రసాయన పరిశ్రమలు, వ్యర్థాల నుంచి కాపాడాలని ఉద్యమం చేస్తుంటే రసాయన వ్యర్థాల పారబోత మాత్రం ఆగడంలేదన్నారు. సంవత్సరాలుగా శాంపిల్స్ సేకరించడమే జరుగుతుందని, సంబంధిత పరిశ్రమలను మూసివేత మాత్రం జరగడం లేదని ఆగ్రహించారు. రసాయన వ్యర్థాలు పారబోసిన పరిశ్రమలను గుర్తించి మూసివేయాలని డిమాండ్ చేశారు.

పారబోసిన రసాయన వ్యర్థాలను పరిశీలిస్తున్న పీసీబీ అధికారులు

ఎస్టీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలి

నారాయణఖేడ్, జూలై 17: మిగిలిపోయిన ఉపాధ్యాయ ఖాళీల్లో ఎస్టీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు కోరారు. బుధవారం నారాయణఖేడ్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ అధ్యక్షతన నిర్వహించిన టీఎస్ యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యాలయ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, అవసరమైన మేరకు తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్, జిల్లా కార్యదర్శులు ఏశప్ప, నరేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు

వేడుకలకు సిద్ధం.. మైబు సుభానీ దర్గా

టేకూర్ గుట్టపై మైబు సుభానీ దర్గా

చావిడిలో ప్రతిష్ఠించిన పీఠాలు

న్యాల్‌కల్, జూలై 17: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండగ న్యాల్‌కల్ మండలంలోని టేకూర్ గ్రామంలో ప్రత్యేకంగా నిలుస్తున్నది. గురువారం నిర్వహించే వేడుకులకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా నారాయణఖేడ్, మనూరు, జోగిపేట్, మెదక్, సంగారెడ్డి, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. డప్పు చప్పుళ్ల మధ్య పీర్లను గ్రామంలోని ప్రధాన వీధులగుండా ఊరేగింపుగా గుట్టపైన ఉన్న మైబు సుభానీ దర్గా వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి దర్శించుకుంటారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జహీరాబాద్ రూరల్ సీఐ నయీమొద్దీన్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లపై పోలీసు అధికారులు నిర్వాహకులతో సమీక్షించారు. ఈ వేడుకలకు జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు హాజరుకానున్నారు. ఈ వేడుకలను భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

హత్నూర, జూలై 17: హత్నూర మండలం బొక్కలగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు మల్లికార్జున్ బదిలీపై వెళ్లడంతో ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న బొక్కలగూడెం గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

తొలి ఏకాదశి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. అన్ని గ్రామాల్లోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాస దీక్షతో భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దీపారాధనలు చేశారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 17

భక్తుల దర్శనాలతో సందడిగా మారిన వైష్ణవాలయాలు

గుమ్మడిదల: కల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష తులసార్చనలో భక్తులు

జహీరాబాద్‌లోని పండురంగ ఆలయంలో..

న్యాల్‌కల్: రేజింతల్‌లో..

న్యాల్‌కల్: పాండురంగస్వామి ఆలయంలో..

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు

సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేరిన బాలుడు గోపాల్

బొల్లారం, జూలై 17: తప్పిపోయిన బాలుడు క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేరడంతో కన్నవారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 15న బీరప్ప బస్తీకి చెందిన సురేందర్ జేన కొడుకు గోపాల్ జేన(14) ట్యూషన్‌కు వెళ్తున్నానని చెప్పి ఉదయం 6 గంటలకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. తప్పిపోయిన బాలుడు మంగళవారం జీడిమెట్ల నుంచి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించి బాలుడి దగ్గరకు వెళ్లారు. ట్యూషన్‌కు వెళ్తున్న సమయంలో వీధి కుక్కలు అరవడంతో భయాందోళనకు గురై దారి మరిచినట్లు తెలిపాడు. నడుచుకుంటూ జీడిమెట్ల ఇండస్ట్రియల్ వరకు వెళ్లినట్లు చెప్పాడు. అక్కడే ఓ కిరాణా దుకాణం ముందు రాత్రి పడుకున్నానని, మరుసటి రోజు ఓ వ్యక్తి సెల్ ఫోన్ నుంచి తల్లికి సమాచారం అందించాడు. కొడుకు గోపాల్ సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేరడంతో సంతోషం వ్యక్తం చేశారు.

ఎస్సైలకు సన్మానం

కోహీర్ ఎస్సై అరుణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కోహీర్, జూలై 17: కోహీర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అరుణ్‌కుమార్‌తో పాటు జహీరాబాద్ పట్టణ ఎస్సైగా విధుల్లో చేరిన కాశీనాథ్‌ను బుధవారం పలు పార్టీల నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. శాంతిభద్రతల విషయంలో ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సైలు కోరారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, అంజయ్యగౌడ్, రాజు, ప్రకాశ్, కృష్ణ, విశ్వనాథ్, వీరారెడ్డి, సాంసన్, సుభాశ్, తదితరులున్నారు.

బ్లాస్టింగ్‌ల నుంచి గ్రామాన్ని కాపాడండి

జిన్నారం, జూలై 17: క్వారీ బ్లాస్టింగ్‌ల నుంచి ఊట్ల పంచాయతీ పరిధిలోని దాదిగూడెం గ్రామాన్ని కాపాడాలని గ్రామస్తులు అధికారులను కోరారు. మంగళవారం రాత్రి జరిపిన పేలుళ్లతో దాదిగూడెం గ్రామం కంపించిందని, అర్ధరాత్రి వరకు నిద్రపోకుండా భయంతో ఇండ్ల నుంచి బయటకు వచ్చి కూర్చున్నామని గ్రామస్తులు వాపోయారు. బుధవారం ఉదయం గ్రామస్తులు సోలక్‌పల్లి, రాళ్లకత్వ గ్రామాల పరిధిలోని క్వారీ పేలుళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడి నుంచే మండల అధికారులు, నాయకులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. సోలక్‌పల్లి, రాళ్లకత్వ గ్రామాల పరిధిలోనే క్వారీలు, కంకర క్రష్షర్లు ఏర్పాటు చేసినప్పటికీ దాదిగూడ గ్రామానికి అతి సమీపంలో అవి ఉన్నాయని, దీంతో రోజూ క్వారీల పేలుళ్లకు నరకం అనుభవిస్తున్నామన్నారు. పెద్ద పెద్ద శబ్దాలు, తెల్లని రాతి దుమ్ముతో అవస్థలు పడుతున్నామని వాపోయారు. కలెక్టర్, మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. గ్రామస్తులు దాది రమేశ్, గంగు రాజు, దేవేందర్, మోత కృష్ణ, వెంకటేశ్, మధు, రవి, నర్సింగ్‌రావు, గిరి, సత్యనారాయణ, శ్రీనివాస్, నర్సింలు, ఆంజనేయులు, శ్రీను, నర్సింలు, సాయికుమార్, వేణు ఉన్నారు.

క్వారీలో జరిపిన పేలుళ్లను పరిశీలిస్తున్న దాదిగూడెం గ్రామస్తులు

మొక్కలు నాటిన చిన్నారులు

పటాన్‌చెరు/అమీన్‌పూర్, జూలై 17: వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బీరంగూడలోని పల్లవి కిడ్జ్ పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటారు. అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని పల్లవి కిడ్జ్ స్కూల్‌లో బుధవారం మొక్కలు నాటారు. పాఠశాల డైరెక్టర్ క్రాంతికుమార్, సెంటర్‌హెడ్ త్రివేణి ఆధ్వర్యంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గుంతలు తవ్వడం, మొక్కలను వేర్లతో పాటు నాటడం, ఎరువులు వేయడం, నీటిని పోయడం తదితర కృత్యాలు చేయించారు. అనంతరం త్రివేణి మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటినుంచి ప్రకృతి ప్రాధాన్యతను నేర్పిస్తున్నామన్నారు. పచ్చదనం, చెట్లు వాటి ప్రాముఖ్యతను వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హేమలత, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న చిన్నారులు

నేడు పంట రుణమాఫీపై సంబురాలు

మనూరు, జూలై 17: మనూరు రైతువేదికలో రుణమాఫీ సంబురాలు నిర్వహించనున్నామని ఏఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓ సంగమేశ్వర్ తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారని, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ శెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ సంజీవరెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

ఎంబీసీ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జిన్నారం, జూలై 17: తెలంగాణ ఎంబీసీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న జెరిపాటి జైపాల్‌ను జిన్నారం కాంగ్రెస్ మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌లో జైపాల్‌ను కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో టీపీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, కె.రాజుగౌడ్, మహేశ్ తదితరులు ఎంబీసీ చైర్మన్ జైపాల్‌ను కలిశారు.

హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న సత్యనారాయణ, దేవేంద్రాచారి, జావిద్

మొన్న కాంగ్రెస్.. నేడు బీఆర్ఎస్

రామచంద్రాపురం, జూలై 17: బీఆర్ఎస్ భారతీనగర్ డివిజన్ సీనియర్ నాయకులు కొందరు మొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి నివాసంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాటి సత్యనారాయణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దేవేంద్రాచారి, జావిద్ తిరిగి మాజీ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలోకి చేరిన వారికి మాజీ మంత్రి హరీశ్‌రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకుంటామన్నారు. పార్టీ శ్రేణులు ఎవరూ అధైర్యపడవద్దని భవిష్యత్తు మళ్లీ మనదే ఉంటుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాములుగౌడ్, కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, నర్సింహ, దేవేందర్‌యాదవ్, బాబ్జీ, రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీశైలం ఉన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి

గుమ్మడిదల, జూలై 17: బీఆర్ఎస్ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు గౌరీశంకర్‌గౌడ్, సీనియర్ నాయకుడు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలిపారు. బుధవారం రామచంద్రపురంలో జరిగిన ప్రెస్‌మీట్ సందర్భంగా హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు పొన్నబోయిన వేణు, గోపాల్, మంగయ్య, నరేందర్‌రెడ్డి, మడపతి గణేశ్, యాదగిరి, గటాటి రమేశ్ ఉన్నారు.

మాజీమంత్రి హరీశ్‌రావును కలిసిన గుమ్మడిదల బీఆర్ఎస్ నాయకులు

రాష్ట్ర నేతలతో బొంతపల్లి నాయకులు

గుమ్మడిదల, జూలై 17: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులను బొంతపల్లి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం రామచంద్రపురంలో జరిగిన పార్టీ సమావేశానికి హాజరైన అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనచారి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డిని బీఆర్ఎస్ బొంతపల్లి నాయకులు గౌరీశంకర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, గటాటి రమేశ్ కలిశారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులను కలిసిన బొంతపల్లి బీఆర్ఎస్ నాయకులు

హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నేతలు



హరీశ్‌రావుకు కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు

బొల్లారం, జూలై 17: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును బీఆర్ఎస్ బొల్లారం మున్సిపాలిటీ నాయకులు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శ్ రెడ్డి నివాసానికి వచ్చిన హరీశ్‌రావుకు బాల్‌రెడ్డి కౌన్సిలర్లతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోలన్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు వేణుపాల్‌రెడ్డి, సాయి కిరణ్‌రెడ్డి, సతీశ్, శ్రీకాంత్‌యాదవ్, బీరప్పయాదవ్, మాజీ ఎంపీటీసీలు యాదగిరిగౌడ్, రత్నం, నాయకులు జైపాల్‌రెడ్డి, పుండరీకం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హత్నూర, జూలై 17: హత్నూర మండలం సాదుల్లానగర్‌లో బుధవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సీసీ రోడ్డు పనులు పూర్తయితే రవాణా కష్టాలు తీరుతాయన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

గుమ్మడిదల, జూలై 17: ఏకలవ్యుడి జయంతి వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎరుకల సంఘం అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కుతాడి వీరేశం, సభ్యులు సుధ, మైసయ్య, కుతాడి యాదగిరి పాల్గొన్నారు.

గుమ్మడిదలలో ఏకలవ్యుడికి నివాళులు అర్పిస్తున్న ఎరుకల సంఘం నాయకులు

పాత నేరస్తులు సత్ప్రవర్తనతో ఉండాలి

కోహీర్, జూలై 17: పాత నేరస్తులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని పాత నేరస్తులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలను భయభ్రాంతులు, హింసకు గురిచేసినా పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. ఎలాంటి తగాదాల్లో తలదూర్చొద్దని సూచించారు. మంచి అలవాట్లతో మసులుకోవాలన్నారు. డీఎస్పీ వెంట సీఐ రవి, ఎస్సై కాశీనాథ్ ఉన్నారు.

పాత నేరస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

ఊరూరా పీర్ల ఊరేగింపు

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. కులమతాలకతీతంగా పుర వీధుల గుండా పీర్ల ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య తప్పెట దరువులకు అసెయ్‌దులా అంటూ చిందులు వేశారు. భక్తులు పీర్లకు ఊదు, దట్టీలు, పూలు, మాలీధా ముద్దలు, ఒడి బియ్యం, కుడుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దర్గాల వద్ద భక్తులకు అన్నదానాలు చేశారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. - నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 17

ఝరాసంగం: ఎల్గోయిలో పీర్లను దర్శించుకుంటున్న సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, తదితరులు

వట్‌పల్లి: గౌతపూర్‌లో మొహరం వేడుకల్లో గ్రామస్తులు



కోహీర్: కవేలిలో పీరీల ముందు నృత్యాలు

హత్నూరలో..

నారాయణఖేడ్: రుద్రారంలో పీర్ల ఊరేగింపు